

చక్రూతండాలో నిత్యావసరాలు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

## శ్రామికులతోనే దేశాభివృద్ధి సాధ్యం: పరుపాటి

రాయపర్తి, నవంబర్ 16: శ్రామికులు, కార్మికుల స్వేద బింధువుల్లోనే దేశ సమగ్రాభివృద్ధి దాగి ఉందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శివరామపురంలోని మొరిపిరాల క్రాస్‌రోడ్ సమీపంలో ఏఐటీయూసీ జిల్లా ప్రతినిధుల సారథ్యంలో శనివారం నిర్వహించిన తాపీమేస్త్రీల సంఘం మహాసభలను ఆయన ప్రారంభించారు. కార్మికులు, శ్రామికులు ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం తాపీమేస్త్రీ సంఘం మండలాధ్యక్షుడిగా ఎన్నికైన గబ్బెట కొమురయ్యను సన్మానించారు. వెయ్యి మంది శ్రామికులు, కార్మికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు అనిమిరెడ్డి, కుమార్, మధు. శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, మధుకర్‌రెడ్డి, చెడుపాక కుమార్, మహేందర్‌రెడ్డి, సందిదేవేందర్‌రెడ్డి, అమ్మిరెడ్డి, కోల సంపత్, ఎల్లస్వామి, చెడుపాక యాకయ్య, భూముల అంజయ్య పాల్గొన్నారు. అనంతరం మైలారంలో హమాలీల కోసం తాను సమకూర్చిన ఎలక్ట్రానిక్ కాంటా ప్రారంభించారు. మైలారం శివారు చక్రూతండాకు చెందిన బాదావత్ బిచ్యానాయక్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో గొడుగు నర్సయ్య, బాద సుధాకర్, యాట ప్రశాంత్, అన్వేశ్, గూడెల్లి వెంకటయ్య, బైరు యాకయ్య, గుగులోత్ చందూనాయక్ పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు

గీసుగొండ, నవంబర్ 16: శాయంపేట గ్రామంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి శనివారం తెలిపారు. 863 మంది భూ నిర్వాసితులకు ఇండ్లు మంజూరు చేయడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వస్తుందన్నారు. ఈ నెల 19న సీఎం చేతులమీదుగా వరంగల్‌లో ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

## మండలంలో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు



మల్యాతండాలో వడ్లను పరిశీలిస్తున్న అధికారులు

పర్వతగిరి, నవంబర్ 16: మండలంలోని మల్యాతండా, ఏనుగల్లు, చౌటపల్లి, అనంతారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం తనిఖీ చేసింది. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ ప్రభాకర్, డీటీసీఎస్ కిరణ్‌కుమార్, ఎస్సైలు కృష్ణ, జంగయ్య నిర్వాహకులు, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్యాడీ క్లీనర్‌తో ధాన్యంలోని చెత్తాచెదారం తొలగించి సన్న వడ్లకు ప్రభుత్వం అందించే రూ. 500 బోనస్ పొందాలని రైతులకు సూచించారు. వారి వెంట కొనుగోలు కేంద్రం సిబ్బంది పీఏసీఎస్ కుమార్, సికింధర్, ఏఈవో ఎస్.రాకేశ్, రైతులు ఉన్నారు.

# కంకినల్లిని తట్టుకునే శక్తి '504'కు లేదు

- విత్తనాల లోపమే పంట నష్టానికి కారణం
- స్పష్టం చేసిన వ్యవసాయ శాస్త్రవేత్తలు
- బుధరావుపేటలో 400 ఎకరాల్లో దెబ్బ తిన్న వరి పంట పరిశీలన



బుధరావుపేటలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఖానాపురం, నవంబర్ 16: కంకినల్లిని తట్టుకునే శక్తి బయో 504 విత్తనాలకు లేకపోవడం వల్లే పంట దెబ్బతిని దిగుబడి తగ్గేందుకు ప్రధాన కారణమైందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. మండలంలోని బుధరావుపేటకు చెందిన వంద మంది రైతులు 400 ఎకరాల్లో బయోసీడ్ 504 రకం విత్తనాలను సాగు చేశారు. పంట దెబ్బతిని ఎకరానికి పది బస్తాల దిగుబడి కూడా రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు తమ సమస్యను జిల్లా వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దిగుబడి తగ్గడానికి గల కారణాలను విశ్లేషించడానికి శనివారం వరంగల్ ఏరువాక కో ఆర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్‌కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ నాగభూషణం, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ విశ్వతేజ బృందం గ్రామానికి చేరుకుని దెబ్బతిన్న పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బయోసీడ్ 504 రకం విత్తనాలకు కంకినల్లిని తట్టుకునే సామర్థ్యం లేదని స్పష్టం చేశారు.

### 80 శాతం మేర పంటనష్టం

బుధరావుపేట రైతులు సాగు చేసిన 400 ఎకరాల్లో కంకినల్లి సోకిందని శాస్త్రవేత్తలు అన్నారు. వైరస్‌ను తట్టుకునే సామర్థ్యం లేకపోవడం వల్లే 80 శాతం గింజ నల్లగా, తాలుగా మారిందన్నారు. కంకినల్లిని తట్టుకునే శక్తి తక్కువగా ఉంటుందని సీడ్ కొనుగోలు చేసే ముందే కంపెనీ యాజమాన్యం రైతులకు తెలియజే యాల్సి ఉందన్నారు. కానీ, కంపెనీ చెప్పకపోవడంతో రైతులు విత్తనాలు కొని సాగు చేసి నష్టపోయారన్నారు. ప్రభుత్వం అందజేసే విత్తనాలనే కొనుగోలు చేసి సాగు చేసుకోవాలని ఈ సందర్భంగా అన్నదాతలకు శాస్త్రవేత్తలు సూచించారు. అప్పుడే అధిక దిగుబడి సాధ్యమన్నారు. రాష్ట్రంలోని ప్రతి వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వరి విత్తనాలను రైతులు కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. రైతులు ప్రైవేట్ కంపెనీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దని కోరారు. పంట నష్టానికి సంబంధించి నివేదికను రెండు రోజు ల్లో వ్యవసాయ ఉన్నతాధికారులకు అంజేస్తామన్నారు. కాగా, స్థానిక వ్యవసాయధికారి పంట నష్టం విషయమై పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు వల్లెపు కుమారస్వామి, గట్ల సుదర్శన్, పీ మధుసూదన్‌రావు, సోమ వెంకట్‌రెడ్డి, పీ సోమనర్సయ్య, జే పూల్యానాయక్, వెంకన్న, ఎల్లయ్య, లాల్‌సాబ్ పాల్గొన్నారు.

# రైతులు నిలదీస్తారనే మొహం చాటేస్తున్న దొంతి

- ప్రొటోకాల్ పాటించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- రైతన్నలకు కరువైన భరోసా
- బోనస్ ఎగ్గొట్టడమే కాంగ్రెస్ లక్ష్యం
- సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నెక్కొండ, నవంబర్ 16: నిలదీస్తారనే భయంతోనే నర్సంపేట ఎమ్మెల్యే రైతులకు మొహం చాటేస్తున్నారని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలకు రాకుండా, ప్రొటోకాల్ పాటించకుండా చోటామోటా నాయకులతో ప్రారంభిస్తున్నారని బీఆర్ఎస్ మండల నాయకులు విమర్శించారు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్ మాట్లాడారు. అన్నదాతలు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే హాజరు కాకపోవడం దారుణమన్నారు. రైతుబంధు ఎగ్గొట్టడం, మద్దతు ధర రాకపోవడంతో రైతన్నలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని, కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి హాజరైతే రైతులు ప్రశ్నిస్తారనే ఎమ్మెల్యే రావడం లేదన్నారు. టీస్టాల్స్ తదితర ప్రైవేట్ వ్యాపార కేంద్రాల ప్రారంభాలకు హాజరవుతున్న దొంతి కొనుగోలు కేంద్రాలను మాత్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు.

రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కి నట్టేట ముంచిందన్నారు. ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలకు హాజరై రైతులకు ప్రభుత్వం బోనస్ ఇస్తుందని గట్టిగా హామీ ఇస్తే అన్నదాతలకు న్యాయం జరిగేదన్నారు. కానీ, దొంతి పట్టించుకోకపోవడంతో దళారులకు ధాన్యాన్ని విక్రయిస్తూ రైతులు నిండా మునుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు బోనస్‌ను ఎగ్గొట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తున్నదని విమర్శించారు. సొసైటీ చైర్మన్లను పక్కన బెట్టి ప్రొటోకల్ పాటించకండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ నాయకులు ప్రారంభిస్తుంటే.. అధికార యంత్రాంగం వత్తాసు పలుకుతోందని దుయ్యబట్టారు. సమావేశంలో సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటుక సోమయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, దేవనబోయిన వీరభద్రయ్య, హచ్.శ్రీను, టీ సాంబయ్య, డీ సారంగం, పీ సత్యం, లింగ్యానాయక్ , వాగ్యానాయక్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అరుణ

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ

నల్లబెల్లి, నవంబర్ 16: పిల్లల శారీరక ఎదుగుదల కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవులపల్లి అరుణ అన్నారు. లెంకాలపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార వారోత్సవాలతోపాటు హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సులోపు పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్లలో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు పాలు, కోడిగుడ్లు, బాలామృతం ప్లస్ లాంటి టేక్ హోమ్ రేషన్‌ను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్త ఆకుల సునీత, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో అపహరణపై కేసు నమోదు

గిర్మాజీపేట, నవంబర్ 16: ఆటో అపహరణపై కేసు నమోదు చేసినట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ ఎంఏ షుకూర్ తెలిపారు. కాశీబుగ్గకు చెందిన నమిండ్ల ప్రభాకర్ ఎండీ హఫీజ్‌కు చెందిన ఆటోను అద్దెకు తీసుకొని నడుపుతున్నాడు. ఈక్రమంలో ఈ నెల 13న రాత్రి మడిపల్లిలో బార్ ఎదురుగా ఆపి చిట్టీ డబ్బులు చెల్లించేందుకు వెళ్లాడు. పది నిమిషాల తర్వాత వచ్చే సరికి ఆటో కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం బాధితుడు ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు.

## టీహబ్‌కు 'తాళ్ల పద్మావతి' విద్యార్థులు

కరీమాబాద్, నవంబర్ 16: గత సెప్టెంబర్ 13న నిర్వహించిన రోబోక్సియాన్ వర్క్‌షాప్ పోటీల్లో వరంగల్‌లోని తాళ్ల పద్మావతి అంతర్జాతీయ పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు తెలంగాణ హబ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం తెలిపారు. ఈ మేరకు శనివారం విద్యార్థులను పాఠశాల ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా తాళ్ల మల్లేశం మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనతో టీహబ్‌కు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు తాళ్ల వరుణ్–వైష్ణవి, ప్రిన్సిపాల్ స్వర్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడే తత్వం అలవర్చుకోవాలి

ఖానాపురం, నవంబర్ 16: విద్యార్థులు చిన్ననాటి నుంచే కష్టపడే తత్వం అలవర్చుకోవాలని నర్సంపేట గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు అన్నారు. బుధరావుపేట మోడల్‌స్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థులకు శనివారం సుబ్బారావు రూ. 15 వేల విలువైన పుస్తకాలను అందజేశారు. దాతల సహకారాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు శ్రీధర్, రాజేందర్, రాజేంద్రప్రసాద్, వసీం, పద్మావతి పాల్గొన్నారు.

### దశాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

దుగ్గొండి, నవంబర్ 16: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ జనాభాకు తగ్గట్టు రిజర్వేషన్ కల్పించాలని జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి డిమాండ్ చేశారు. ఈ నెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి గ్రామంలో మహాసభ జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. శనివారం గిర్నిబావిలో ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

### గంగదేవిపల్లిని సందర్శించిన విద్యార్థులు

గీసుగొండ, నవంబర్ 16: జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని శనివారం నర్సంపేటలోని గీతాంజలి, శివానీ గ్లోబల్ స్కూల్‌లో 6 నుంచి 9వ తరగతి చదుతున్న 117 మంది విద్యార్థులు స్టడీ టూర్‌లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిని జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి పిల్లలకు వివరించారు. టీచర్లు రాజు, రహీముద్దీన్, మురళి, కవిత, లావణ్య, సభ్యులు పాల్గొన్నారు.

## యువకుడికి రెండు సర్కారు కొలువులు



అజయ్

వర్ధన్నపేట, నవంబర్ 16: కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించాడో యువకుడు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన జంబారపు అజయ్(20) ఇటీవల జరిగిన కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ క్రమంలోనే ప్రభుత్వం గ్రూప్–4 ఉద్యోగాలు ప్రకటించడంతో కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపియ్యాడు. ఇందుకు సంబంధించిన నియామక పత్రం శనివారం అజయ్‌కి అందడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి చెందిన జంబారపు అశోక్–కవిత దంపతులకు ఇద్దరు కుమారులు. అజయ్ పెద్ద కుమారుడు. అశోక్ సెలూన్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తండ్రి కష్టాన్ని అర్థం చేసుకున్న అజయ్ డిగ్రీ వరకు చదివి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో స్థానికులు అభినందిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వర్ధన్నపేట, నవంబర్ 16: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలకేంద్రం సమీపంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వర్ధన్నపేటకు చెందిన నిమ్మాని సోమేశ్వర్‌రావు(58) ద్విచక్ర వాహనంపై వర్ధన్నపేట నుంచి తొర్రూరు వైపు వెళ్తున్నాడు. తొర్రూరు నుంచి వరంగల్ వైపు వస్తున్న మరో బైక్ ఎదురుగా ఢీకొట్టింది. దీంతో సోమేశ్వర్‌రావుకు గాయాలు కావడంతోపాటు కుడికాలు విరిగింది. వెంటనే అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు.

## 'విద్యా సంస్థల్లో ఎన్నికలు నిర్వహించాలి'

కరీమాబాద్, నవంబర్ 16: రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకూ విద్యార్థుల ఎన్నికలు నిర్వహించాలని అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు ముఖ్యమంత్రిని కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ట్విట్టర్ ద్వారా సీఎంకు సందేశం పంపారు. ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థి దశ నుంచే పిల్లలు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటారన్నారు. తెలంగాణలోని విద్యా సంస్థలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ముగ్గురిపై కేసు నమోదు

గీసుగొండ, నవంబర్ 16: ఎలుకుర్తిలో కొద్ది నెలలుగా ఆటో టైర్లు, డెక్కులు, బ్యాటరీలు, డీజిల్‌ను దొంగిలిస్తున్న సాంబశివుడు, రితిక్, నాగులును శనివారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల నుంచి కొన్ని వస్తువులను రికవరీ చేశామన్నారు.

### చట్టాలపై మహిళలకు అవగాహన

గీసుగొండ, నవంబర్ 16: ప్రభుత్వం కొత్తగా తెచ్చిన క్రిమినల్ చట్టాలపై శనివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహేందర్ మహిళలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలను తెచ్చిందన్నారు. మహిళల హక్కులను కాపాడేందుకు అనేక చట్టాలు ఉన్నాయని గుర్తుచేశారు.

## '26న కలెక్టరేట్ ముట్టడికి సిద్ధం కావాలి'

వరంగల్‌చౌరస్తా, నవంబర్ 16: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడికి రైతులు, కార్మిక సంఘాల సభ్యులు తరలివచ్చేందుకు సిద్ధంగా ఉండాలని ఆల్ ట్రేడ్ యూనియన్స్, రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. వరంగల్‌లోని ఓంకార్ భవన్‌లో శనివారం ప్రజా, రైతు, కార్మిక సంఘం ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు నర్ర ప్రతాప్, ఐఎన్‌టీసీ జిల్లా అధ్యక్షుడు పుల్ల రమేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేశ్, ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామస్వామి పాల్గొని మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## కార్మికుల శ్రమను దోచుకుంటున్న బీజేపీ సర్కార్



నినాదాలు చేస్తున్న ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకులు

నల్లబెల్లి, నవంబర్ 16: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్మికుల శ్రమను దోచుకుంటున్నదని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం ఆరోపించారు. శనిగరం ఏరియా మిల్, హమాలీ కార్మికుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందని, దీని ఫలితంగా కార్మికుల హక్కులు హరించుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగ కార్మికుల శ్రమను బహులజాతి కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ కుటిల యత్నాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు ఈర్ల రాజు, మానగాని ప్రశాంత్, కోమాండ్ల రమేశ్, వైనాల రవి, జన్ను రవి, రమేశ్, మధుకర్, లింగన్న, భద్రు, పిట్టల దేవేందర్, తాళ్లపల్లి రవి, రాజు, భిక్షపతి, అనిల్, రాజన్న, ఉపేంద్ర, ఐలమ్మ, మంజుల పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

వరంగల్‌చౌరస్తా/నర్సంపేట, నవంబర్16: మంచిర్యాల జిల్లా రాజీవ్‌నగర్‌కు చెందిన గడ్డం శైలజగౌడ్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ శనివారం ఎంజీఎం హాస్పిటల్‌లో కన్నుమూసింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి దహన సంస్కారాలు చేసే పరిస్థితి లేకపోవడంతో యువ నేతాజీ ఫౌండేషన్ సభ్యుడు, ఎంజీఎం ఔట్‌పోస్ట్ కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్‌కుమార్ సామాజిక మాధ్యమాల ద్వారా దాతల నుంచి రూ. 13,500 విరాళాలు సేకరించారు. అనంతరం మృతురాలి భర్త కిరణ్‌కుమార్, కుమారులు సాయికుమార్, గౌతంకు అందజేశారు. అలాగే, ఇటీవల దుగ్గొండి మండలం చలపర్తికి చెందిన కుంటమల్ల గణేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, జీప్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి నర్సంపేటలో రూ. 34,400 ఆర్థిక సాయం అందించారు. గౌరవాధ్యక్షుడు నాగిశెట్టి ప్రసాద్, ప్రవీణ్, వర్రంకి వేణు, తాళ్లపల్లి స్వామి పాల్గొన్నారు.

## వరంగల్‌లో 20న జాబ్ మేళా

పోచమ్మమైదాన్, నవంబర్ 16: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 20న ములుగురోడ్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో 15 సేల్స్ ఆఫీసర్లు, మూథూట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో వంద డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, సర్వగ్ర ఫైనాన్స్‌లో 15 బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఆఫీసర్ల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు సర్టిఫికెట్లతో వరంగల్ ములుగురోడ్డులోని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 7093168464 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## నాటక సమాఖ్య సలహాదారుడిగా సదానందాచారి



సదానందాచారి

గీసుగొండ, నవంబర్ 16: నాటక రంగంలో 60 ఏళ్ల అనుభవం ఉన్న వరంగల్‌కు చెందిన మారెడోజు సదానందాచారిని తెలంగాణ నాటక సమాఖ్య గౌరవ సలహాదారుడిగా నియమించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమాఖ్య కోర్ కమిటీ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం తెలిపారు.

## టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీ



సంపత్, కుమార్

పర్వతగిరి, నవంబర్ 16: టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరంగంటి సంపత్, ప్రధాన కార్యదర్శిగా వీ అరవింద్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మేకిరి దామోదర్ పాల్గొన్నారు.

## అమీన్‌పేటలో వృద్ధురాలి ఆత్మహత్య

చెన్నారావుపేట, నవంబర్ 16: వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పేటలో జరిగింది. మాజీ సర్పంచ్ ముసిపట్ల రామక్క(68) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆమె శుక్రవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. రామక్క కుమారుడు సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు.

## విద్యార్థినీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

పోచమ్మమైదాన్, నవంబర్ 16: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం విద్యార్థినీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు పచ్చదనం–పరిశుభ్రత, కళాశాల విద్యార్థులకు నేటి సమాజంలో గ్రంథాలయాల పాత్ర అంశంపై వక్తృత్వ పోటీలు జరిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి కె.శశిజాదేవి, డాక్టర్ తయ్యాల శ్రీధరాచార్యులు, అరుణ, శ్రీధర్, లైబ్రేరియన్లు ఎం.చిన్నబాబు, పద్మారావు, రాంచందర్, అశోక్, లలిత, రజిత, లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలల హక్కులను పరిరక్షించాలి

గిర్మాజీపేట, నవంబర్ 16: బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇంతెజార్‌గంజ్ సీఐ ఎంఏ షుకూర్ అన్నారు. వరంగల్‌లోని చైల్డ్‌రైట్స్ అడ్వైజరీ ఫోరం వారు నిర్వహిస్తున్న బాలల హక్కుల వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సీఐ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కుమ్మరి బాబురాజ్, ప్రధాన కార్యదర్శి అయిత ఉషాభాస్కర్, ఉపాధ్యక్షుడు గండి ఆనందం, కమిటీ సభ్యుడు భగత్, మై ఛాయిస్ ఫౌండేషన్ నిర్వాహకుడు చిరంజీవి, కానిస్టేబుల్ ఉపేందర్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

రాయపర్తి, నవంబర్ 16: రాయపర్తి ఎస్సీకాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన అయిత మల్లయ్యతోపాటు మైలారం శివారు చక్రూతండాకు చెందిన బాదావత్ బిచ్యానాయక్ కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి శనివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు గారె నర్సయ్య, మహ్మద్ నయీం, బల్లెం యాదగిరి, ఉబ్బని సింహాద్రి, మచ్చ సత్యం, చందు సతీశ్‌కుమార్, అయిత రవి, పీరని రవీందర్, జంపీ, యాకూబ్, గారె నరేశ్, అయిత యాకయ్య, గుగులోత్ భోజ్యానాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఖిలావరంగల్, నవంబర్ 16: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ జే వెంకటరత్నం శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో తలదూర్చొదని సూచించారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని చూస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

## 'అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలి'

దుగ్గొండి, నవంబర్ 16: కొడంగల్ నియోజకవర్గం లగచర్ల ఘటనలో అరెస్టయిన గిరిజన రైతులను వెంటనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విడుదల చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లంబాడ ఓట్లతో గెలిచి ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన వెంట భూక్యా జగన్‌నాయక్, బోడ మురళీనాయక్, జాటోత్ తిరుపతినాయక్, రవి, రాజు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో అన్నదానం

నర్సంపేట, నవంబర్ 16: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మండల పూజలో భాగంగా స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, సురేశ్, కమాలకర్‌రెడ్డి, అర్చకులు దేశి రాము, శ్రీధర్, అన్నదాతలు ఓదెల సాంబయ్య, రాజమౌళి, బైరి విఠల్, భిక్షపతి పాల్గొన్నారు.

## పెర్కవేడులో సినీఫక్కీలో చోరీ

రాయపర్తి, నవంబర్ 16: మండలంలోని పెర్కవేడులో సినీఫక్కీలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామానికి చెందిన సుతారి సేనాపతి తన కుటుంబంతో కలిసి కార్తిక పూజల కోసం శుక్రవారం ఆలయానికి వెళ్లాడు. తల్లి శశిరేఖ(76) ఇంట్లో ఒంటరిగా టీవీ చూస్తున్నది. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి శశిరేఖ కళ్లు మూసి ఆమె మెడలోని సుమారు 3 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. సేనాపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్ తెలిపారు.

## ఆయిల్‌పాం సాగు రైతులకు లాభదాయకం

సంగెం, నవంబర్ 16: ఆయిల్‌పాం సాగుతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని రాంచరణ్ ఇండస్ట్రీస్ జీఎం సత్యనారాయణ అన్నారు. మండలంలోని కోట వెంకటాపురంలో శనివారం పోశాల చంద్రశేఖర్ ఆయిల్‌పాం క్షేత్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జనాభా పెరుగుతున్న దృష్ట్యా ఆయిల్ వినియోగం కూడా పెరుగుతుతోందన్నారు. ఆయిల్‌కు డిమాండ్ ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. సాగు చేసే రైతులు 90 శాతం సబ్సిడీతో ఆయిల్‌పాం మొక్కలు పొందొచ్చన్నారు. సదస్సులో అధికారి అనిల్, కో ఆర్డినేటర్ దేవరాజ్, రైతు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మండల నూతన కార్యవర్గం



కిశోర్

సంగెం, నవంబర్ 16: ఎమ్మార్పీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం చాతాళ్ల రమేశ్ అధ్యక్షతన జాతీయ నాయకుడు మంద కుమార్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకునారు. అధ్యక్షుడిగా దామెర కిశోర్, ఉపాధ్యక్షులుగా కలకోట్ల యాకంబ్రం, బాష్పాక రాములు, కట్ల అశోక్, పరికి ఏశోబు, ప్రధాన కార్యదర్శిగా కోడూరి రాజు, కార్యదర్శులుగా సదిరం అశోక్, బర్ల మహేశ్, ప్రచార కార్యదర్శిగా కొలకనూరి రవీందర్ ఎన్నికయ్యారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

WANTED TELECALLERS

★URGENT REQUIREMENT for ICICI HDFC AXIS INDUSIND BANK'S DSA PERSONAL LOANS EXPERIENCE AND FRESHER FEMALE TELE-CALLERS SALARY+INCENTIVESJOB LOCATION: HANAMKONDA, CONT: +91 9398286149.
NTW-7705

WANTED HOSPITAL STAFF

★Operation Theater Boys, Medical Shop Assts. & Computer Operators/Administrators /Supervisors Required Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm
NTW-450

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All





TO-LET



★Commercial Building 3 Floors + Penthouse for Rent, Beside Akshaya Hotel, Jangaon. Ph: 8099573388.
NT-98831

RENT

★3 floors building for rent, each floor has 3600sqft Ground floor for parking place available, opp:ASM DEGREE & PG WOMENS COLLEGE,Fort Road Warangal M: 9849987808/8309884828.
NTW-17373

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565